క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

కరీంనగర్: పార్టిషన్ హార్రర్స్ రీయంబరెన్స్ రిలేటెడ్ పార్టిషన్ ఆఫ్ ఇండియా కోసం డీఎఫ్ఎస్ ఆదేశాల మేరకు నగరంలోని ఇండియన్ బ్యాంక్ ఎగ్జిబిషన్ మేళా నిర్వహించింది. బ్యాంక్ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కోరా, జాన్సన్ విద్యార్థులు పాల్గొని బ్యాంకు వల్ల లాభాలు, ప్రయోజనాలను రాత పూర్వకంగా విశదీకరించారు. పోటీల్లో మొదటి బహుమతి నందిని, పి. ఐశ్వర్య, కె.సాహితీ, రెండో బహుమతి డి.అనాధిక, ఎ.అక్షతేజశ్రీ, ఎం.దివ్య, మూడో బహుమతులు హర్షవర్ధన్, రాగిణి, దివ్యలు సాధించారు. వీరికి జోనల్ మేనేజర్ ఎస్. శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్, ఎం.శివరాంలు బహుమతి ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష రెడ్డిలు అభినందించారు.

వినోద్‌కుమార్‌ను కలిసిన సంపత్‌రావు



వినోద్‌కుమార్‌తో సంపత్‌రావు

కరీంనగర్‌రూరల్: పద్మనాయక వెలమ సంఘం జిల్లా ఎన్నికల్లో కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన దుర్శేడ్ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు సోమవారం ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంపత్‌రావును వినోద్‌కుమార్ అభినందించి స్వీటు తినిపించారు. అనంతరం మంత్రి గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావును సంపత్‌రావు మర్యాదపూర్వకంగా కలవగా అభినందనలు తెలిపారు.

పేరు మారింది

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ అర్బన్: కలెక్టర్ క్యాంపు కార్యాలయ నేమ్ ప్లేట్ మారింది. 'సారు మారినా పేరు మారలే' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ఫొటోస్టోరీ ప్రచురితమైంది. ఈక్రమంలో స్పందించిన సిబ్బంది నూతన కలెక్టర్ డా.బి.గోపి పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ-1 డిపో మేనేజర్‌గా మల్లేశం బాధ్యతల స్వీకరణ



రీజినల్ మేనేజర్ సుచరితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లేశం

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్-1 డిపో మేనేజర్‌గా ఎల్.మల్లేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి డిపో మేనేజర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై కరీంనగర్-1 డిపోకు వచ్చారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రీజినల్ మేనేజర్ ఎన్.సుచరితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వాల భద్రారావుకు కళాసాగర్ బిరుదు ప్రదానం



వాల భద్రారావును కళాసాగర్ బిరుదుతో సన్మానిస్తున్న ప్రతినిధులు

కరీంనగర్‌కల్చరల్: కవి, రచయిత, గాయకుడైన వాల భద్రారావుకు కళాసాగర్ బిరుదు ప్రదానం చేసి సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. సోమవారం రాత్రి నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ వయోవృద్ధుల కేర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిరుదు అందజేశారు. బోయినపల్లి వెంకటరామారావు ఇవ్వాలని సంకల్పించిన ఈ బిరుదు సోమవారం ప్రదానం చేసినట్లు సంఘ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సముద్రాల జనార్దన్‌రావులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది చిట్టినేని ప్రకాశరావు, టీఎన్జీవో మాజీ నాయకురాలు లక్ష్మీ, ముదుగంటి సుధాకర్‌రెడ్డి, నాగేశ్వర్, అంజయ్య, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు సన్మానం



కరీంనగర్‌అర్బన్: ఇటీవల నాయబ్ తహసీల్దార్ నుంచి తహసీల్దార్లుగా పదోన్నతి పొందిన వారిని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. సోమవారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కముటం శ్రావణ్‌కుమార్, హరి కిరణ్‌కుమార్, ఎస్.మహేశ్‌కుమార్, జి.రమేశ్, వి.శ్రీనివాస్‌రెడ్డి, గండె లక్ష్మీనర్సింహరావు, జి.సుధాకర్, చంద్రశేఖర్‌లను సన్మానించారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు సర్దార్ హర్మిందర్‌సింగ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, మారుపాక రాజేశ్‌భరద్వాజ, నేరేళ్ల కిషన్, మన్మిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

థాంక్యూ కేసీఆర్ సార్



కరీంనగర్‌కల్చరల్: గ్రూప్-2 పరీక్షలను రీ షెడ్యూల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ తేదీలను ప్రకటించిన సందర్భంగా కరీంనగర్‌లోని గ్రంథాలయ ఆవరణలో సోమవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రూప్-2కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు థాంక్యూ కేసీఆర్ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం కటౌట్‌కు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్-2 అభ్యర్థులు పాల్గొన్నారు.

నేడు 'నా మట్టి.. నా దేశం'

కరీంనగర్‌రూరల్: స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం అన్ని గ్రామాల్లో నా మట్టి.. నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించాలని కరీంనగర్ ఎంపీడీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి కోరారు. గ్రామంలోని అమృత్ సరోవర్. కమ్యూనిటీహాల్, స్కూల్ ఏదేని ఇతర ప్రాంతాలను ఎంపిక చేసుకుని 75 మొక్కలు నాటాలని, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి శిలాఫలకంపై పేర్లను రాసి మొక్కలు నాటిన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలు నాటిన ప్రదేశంలో పిడికెడు మట్టిని తీసుకుని భూమాతకు వందనం చేసి జాతీయజెండాను ఎగురవేసి జాతీయ గీతం ఆలపించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు తీసి గూగుల్ లింక్‌డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

అసమానతలపై అక్షరాయుధం వేణుశ్రీ

- పద్య, వచన కవిత్వంతో సమకాలీన సాహిత్యం
- ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా రచనలు
- వరించిన పురస్కారాలు



సాహితీ కౌముది బిరుదు అందుకుంటున్న వేణుశ్రీ (ఫైల్)

కరీంనగర్‌కల్చరల్: ఒక వైపు పద్యం కవిత్వం, మరోవైపు వచన కవిత్వం రాస్తూ సామాజిక అసమానతలపై తన కవిత్వాన్ని సంధిస్తున్నారు కవి వేణుశ్రీ. సంప్రదాయ సాహిత్యాన్ని, సమకాలీన సాహిత్యాన్ని రెండువైపులా పదునైన కత్తిలా రచనలు సాగించి సాహితీవనంలో తనదంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. 1954 ఫిబ్రవరి 4న కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో హనుమండ్లు-గోదావరి దంపతులకు సుదర్శనం వేణుశ్రీ జన్మించారు. విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో బీఓఎల్ చేశారు. హన్మకొండ బీఈడీ కళాశాలలో తెలుగు పండిట్ శిక్షణ పొందారు. కరీంనగర్‌లోని వాణినికేతన్ పాఠశాలలో ఒక సంవత్సరం తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1979 నుంచి సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో తెలుగు ప్రథమ భాషా పండితుడిగా ఉద్యోగం చేసి 2012లో ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ నివాసం ఉంటున్నారు.

పురస్కారాలు.. బిరుదులు..

- ముద్దసాని రాంరెడ్డి స్మారక పురస్కారం.
- చాత్తాద శ్రీవైష్ణవ మహేశ్వరం శాఖ ఆధ్వర్యంలో సన్మానం.
- సమైక్య సాహితీ సన్మానం, స్వేచ్ఛ కవి బిరుదు లభించింది.
- రాగమంజరి, జిల్లా రచయితల సంఘం సారస్వత జ్యోతి మిత్ర మండలి సంఘాలతో సన్మానాలు.
- టీటీడీ అన్నమయ్య కల్చరల్ అకాడమీ వారితో విశిష్ట పురస్కారం.
- ఆంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం వారి ఉగాది పురస్కారం.
- కరీంనగర్‌లో ప్రభుత్వంతో ఉగాది పురస్కారం.
- కరీంనగర్ నవ్య సాహిత్య పరిషత్ వారి మలయశ్రీ అవార్డు అందుకున్నారు.
- జగిత్యాల తెలుగు భాషా పరిరక్షణ సంఘం వారు ప్రజాకవి బిరుదు అందజేశారు.
- జగిత్యాల కౌసల్య తెలుగు పండిట్ శిక్షణా సంస్థచే మధుర కవి బిరుదు, కరీంనగర్ సర్వవేదిక సంస్థ సన్మానం భావశిల్పి, ప్రజాకవి బిరుదు వరించాయి.
- కరీంనగర్ సారస్వత మిత్రమండలితో కాళోజీ బిరుదు ప్రదానం.
- శరత్ చంద్ర సాంస్కృతిక, సామాజిక సేవా ట్రస్టు పురస్కారం.
- 2014లో హైదరాబాద్‌లో కవితాశ్రీ బిరుదు ప్రదానం.
- 2015లో తేజ ఆర్ట్స్ క్రియేషన్ నల్గొండ జిల్లా వారి రాష్ట్ర పురస్కారాన్ని సినారె చేతుల మీదుగా అందుకున్నారు.
- 2021లో తిరునగరి సారస్వత కళాభారతి వారితో సన్మానం.
- 2021లో హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో సర్వార్ధ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రయ్య, పీవీ మనోహర్‌రావు చేతుల మీదుగా సాహితీ కౌముది బిరుదు అందుకున్నారు.
- 2023లో జూలై 30న జడ్చర్ల చెందిన మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో ప్రత్యేక సినారె సాహిత్య పురస్కారం లభించింది.

సాహితీ ప్రస్థానం

- పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి, సినారె, కాళోజీ రాసిన కవిత్వాలు చదువుతూ సాహిత్యం వైపు అడుగులు వేశారు.
- 8వ తరగతి నుంచి పద్యాలు రాయడం ప్రారంభించారు.
- 1976 మొదటి కవిత రాశారు.
- 1990లో స్వేచ్ఛ పుస్తకాన్ని ఆవిష్కరించారు.
- 2009లో ప్రజాభారతం గ్రంథాన్ని వెలువరించారు.
- 2011లో వరేణ్య శతకం విడుదల చేశారు.
- 2013లో తెలంగాణ ఆత్మఘోష పుస్తకాన్ని ముద్రించారు.



- 2021లో ఓ ప్రచేతసా శతకం వెలువరించారు.
- 2022లో కైరవ శతకం ఆవిష్కరించారు.
- పలు సంకలనాలు, కవితలు వివిధ పత్రికల్లో వచ్చాయి.

సాహిత్యం సమాజహితం కోరాలి



సాహిత్యం వటవృక్షంలా ఎదిగి అనేక పాయలుగా మారింది. నేటి కవులు, రచయితలు తాము రాయదల్చుకున్నది ఎవరి గురించి ఎందు గురించి రాయాలని ప్రశ్నించుకోవాలి. మానవులు జీవనవిధానంలో వ్యత్యాసాలు తాము అనుభవిస్తూ ఎదుర్కొంటున్న అనుభవాలు, శాంతియుత వాతావరణంలో మనమంతా మానవులమైనప్పుడు ఉన్మాదులకు గురికాకుండా మానవత్వంతో జీవించే సాహిత్యం అందరికీ హితమవ్వాలని కోరుకుంటా.

– సుదర్శనం వేణుశ్రీ, సాహితీవేత్త

గూడు కల నెరవేరేనా..!

- కరీంనగర్ మండలంలో గృహలక్ష్మి దరఖాస్తులు 1,020
- మండలస్థాయి అధికారులకు అవగాహన సదస్సు
- నేటి నుంచి గ్రామాల్లో సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: సొంతస్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి కరీంనగర్ మండలంలో మొత్తం 1,020 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా చామన్‌పల్లిలో 152 రాగా చెర్లభూత్కూర్‌లో 141, బొమ్మకల్‌లో 130, మొగ్దుంపూర్‌లో 83, నగునూరులో 82, చేగుర్తిలో 71, దుర్శేడ్‌లో 59, ఎలబోతారంలో 54 దరఖాస్తులు వచ్చాయి. తక్కువగా దుబ్బపల్లి-7, మందులపల్లి-15 దరఖాస్తులు వచ్చాయి. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏవోల ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బృందాల అధికారులు, సహాయ అధికారులతో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, దరఖాస్తు దారు పేరు తెల్ల రేషన్‌కార్డులో నమోదై ఉండాలని వివరించారు. దివ్యాంగులకు 5శాతం, ఎస్సీ 20, ఎస్టీ 10, బీసీ మైనార్టీలకు 50, జనరల్ కోటా కింద 15శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. పాత ఇల్లు ఉంటే సర్వే సమయంలో ఇంటిపన్ను, కరెంట్ బిల్లు పరిశీలించాలని, సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండాలని తెలిపారు. ఈనెల 20 వరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేసి 22 వరకు గృహలక్ష్మి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయబ్ తహసీల్దార్ శంకర్, మండల వ్యవసాయాధికారి సత్యం, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభరాణితో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వీపర్లను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేసి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 34 రోజులుగా కలెక్టరేట్ ఎదురుగా స్వీపర్లు చేస్తున్న రిలే దీక్షా శిబిరానికి సోమవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం స్వీపర్లకు కనీస వేతనం చెల్లించకుండా శ్రమదోపిడీకి పాల్పడుతుందన్నారు. కేవలం రూ.5,200ల వేతనంతో పూర్తిస్థాయి పనిగంటలు పనిచేయించుకోవడం శ్రమదోపిడీయే అని, ఆ వేతనం కుటుంబపోషణకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్వీపర్ల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం రూ.26,000 చెల్లించి, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'ఆర్‌అండ్‌బీ'లో సమస్యలు పరిష్కరించాలి



సీఈకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్: రోడ్లు, భవనాల శాఖలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శాఖాపర తనిఖీల్లో భాగంగా సోమవారం కరీంనగర్ వచ్చిన ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ పింగళి సతీశ్‌ను కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ప్రమోషన్లకు సంబంధించి గెజిటెడ్ పోస్ట్ అయిన ఎన్‌టీపీఏ, ఉద్యోగుల జీతాల అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తానని సీఈ హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మారోజు రఘు, కార్యదర్శి బి.శ్రీనివాస్, టీఎన్జీవోల సంఘం రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, నాయకులు బి.దేవేందర్‌రెడ్డి, ఎస్.కరుణాకర్, అరిగె శ్రీనివాస్ తదితరులున్నారు.

జీవో ప్రకారం వేతనాలు పెంచాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్ సిబ్బందికి జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ గోపికి మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ వినతిపత్రం సమర్పించారు. పదేళ్లుగా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని అన్నారు. మోడల్ స్కూల్ తరహాలోనే జీవో 60 ప్రకారం కేర్ టేకర్‌కి రూ.22,750, ఏఎన్ఎంకు రూ.19,500, వాచ్‌మెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్‌కు రూ.15,600 వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని కోరారు. యూనియన్ జిల్లా నాయకులు కృష్ణవేణి, సునీత, అంజలి, మానస తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ డబ్బులు ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు కేసీఆర్ కిట్ డబ్బులు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ గోపికి వినతిపత్రం అందజేశారు. 2021 నుంచి నేటి వరకు 16,442 మంది బాలింతలకు, 38,226 గర్భిణులకు డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు. వైద్యశాఖ అధికారులు, వైద్యశాఖ మంత్రి స్పందించకపోవడంతో డబ్బులు చెల్లించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి అధికారులు, వైద్యశాఖ మంత్రితో చర్చించి అర్హులైన వారందరికీ డబ్బులు ఇవ్వాలని కోరారు. డీవైఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేశ్, తిరుపతి, ఉపాధ్యక్షుడు లక్‌పతి, గిరిజన సంఘం నగర ప్రధాన కార్యదర్శి జి.రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

జాతీయ జెండాలు పంపిణీ



జెండాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

కొత్తపల్లి: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపల్లి పట్టణంలోని 7వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ జాతీయ జెండాలను మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు జాతీయ జెండాలు అందజేసి భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. వార్డు అధికారి మమత, స్థానికులు రుద్ర రాధ, సాయిరాం, రాజేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చెర్లభూత్కూర్‌లో..

చెర్లభూత్కూర్‌లో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి గ్రామస్తులకు జాతీయజెండాలు పంపిణీ చేశారు. స్వాతంత్ర వజ్రోత్సవాల్లో గ్రామస్తులందరూ తప్పనిసరిగా మంగళవారం నివాసగృహాలపై జాతీయపతకాన్ని ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కూర అంజిరెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిల్లు తకరారు.. ప్రచారం బేజారు



ఈవీఎంలతో నిరీక్షిస్తున్న ఉద్యోగులు



కలెక్టరేట్‌లో వాహనాలు

- కలెక్టరేట్‌లోనే ఈవీఎం ప్రచార వాహనాలు

కరీంనగర్ అర్బన్: నిత్యం ఈవీఎం యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన వాహనాలు కలెక్టరేట్‌లో నిలిచిపోయాయి. ఈవీఎంలో ఓటు వేయడం ఎలాగో ఓటర్లకు వివరించేలా ప్రచార వాహనాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఉదయం 10గంటలకు కలెక్టరేట్ నుంచి ఆయా గ్రామాలు, వార్డులకు సిబ్బంది వాహనాలతో వెళ్లి వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ యంత్రాలు ఎలా పని చేస్తాయో వారితోనే ఓటు వేయించి వివరించాల్సి ఉంటుంది. ఎంతమంది ఓటు వేశారో వాటిని లెక్కించి కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో అందజేసి పరికరాలను స్ట్రాంగ్ రూంలో భద్రపర్చడం నిత్య ప్రక్రియ. కరీంనగర్ నియోజకవర్గానికి మూడు వాహనాలు కేటాయించగా సోమవారం సిబ్బంది కలెక్టరేట్‌లో యంత్రాలతో నిరీక్షించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పడిగాపులు కాశారు. వాహనాల బిల్లు రాకపోవడం వల్లే డ్రైవర్లు రాలేదని సమాచారం. వాహనాల డ్రైవర్లు రాలేదని అందుకే తాము ఇలా నిరీక్షిస్తున్నామని సిబ్బంది వివరించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఓపెన్ హైదరాబాద్ కరాటే చాంపియన్‌షిప్-2023 పోటీల్లో రేకుర్తిలోని ప్యారడైజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బంగారు, వెండి పతకాలు సాధించిన సీహెచ్.పునీత్ చంద్ర (7వ తరగతి), ఏ.కృషి (6వ), ఎ.రిషితేజ (3వ)లను అభినందించారు. విద్యార్థులకు విద్యతో పాటు వివిధ క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ టి.వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఎ.మధు, ఏఓ కె.శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.